ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ఎన్‌టిఆర్ జిల్లా నూతన కమిటీ

ప్రజా ఉద్యమాలకు అనుకూలం

- ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం
- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా మహాసభలో వి.శ్రీనివాసరావు, బాబూరావు

ప్రజాశక్తి-తిరువూరు

ప్రస్తుత పరిస్థితులు ప్రజా ఉద్యమాలకు అనుకూలంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తిరువూరులోని ఏచూరి నగర్ (సంకా నరసింహారావు ఫంక్షన్ హాల్)లో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం ఎన్టీఆర్ జిల్లా 25వ మహాసభలో చివరిరోజు ఆదివారం ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజలతో ఉన్న సంబంధాలను రాజకీయ సంబంధాలుగా మలుచుకుని ప్రజా పునాదిని పటిష్టం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారీ (మిగతా 2లో)

జిల్లా కార్యదర్శిగా డి.వి.కృష్ణ ఎన్నిక

25 మందితో నూతన కమిటీ

డి.వి.కృష్ణ

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శిగా డి.వి.కృష్ణ తిరిగి ఎన్నికయ్యారు. తిరువూరులోని ఏచూరి నగర్ (సంకా నరసింహారావు ఫంక్షన్ హాల్)లో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం ఎన్టీఆర్ జిల్లా 25వ మహాసభ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి సభ్యులుగా దోనేపూడి కాశీనాథ్, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, పగడాల వీరాంజనేయులు, కోట కళ్యాణ్, మేకల నాగేంద్రప్రసాద్, బి.సత్యబాబు, కె.శ్రీదేవి, జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్.సిహెచ్.సుప్రజ, ఎ.కమల, ఎస్.నాగమణి, పి.కృష్ణ, బి.రమణరావు, కె.దుర్గారావు, టి.ప్రవీణ్, కె.గోపాల్, పి.ఆనందరావు, వి.నాగరాజు, జి.సీతారామిరెడ్డి, ఎ.వెంకటేశ్వరావు, జి.విజయప్రకాష్, ఎం.మహేష్, జి.క్రాంతి కుమార్, ఎ.సుందరరావు ఈవి.నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సత్యబాబు

కళ్యాణ్

నాగేంద్రప్రసాద్

కాశీనాథ్

శ్రీనివాస్

శ్రీదేవి

వీరాంజనేయులు

ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం అందుకుంటున్న వెంకటసుబ్బారావు

ముగిసిన కథా నాటికల పోటీలు

వెంకటసుబ్బారావుకు ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-విజయవాడ

సాంస్కృతిక వైభవానికి పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతో, భారతీయ, సాంస్కృతిక, సాహిత్య వైభవాన్ని కాపాడే ఉద్దేశంతో అజో-విభో-కందాళం ఫౌండేషన్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన కథా నాటికల పోటీలు, సాహిత్య సదస్సులు, విశిష్ట వ్యక్తులకు గౌరవ పురస్కారాల ప్రదాన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రెండో తేదీన పోటీలు ప్రారంభం కాగా అజో-విభో-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ (యుఎస్ఎ), చైర్మన్ డాక్టర్ కె.వి.రామానుజాచార్యులు (యుఎస్ఎ), జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, తెలుగు డ్రామా నిర్వాహకులు రామకోటేశ్వరరావు, ఉత్సవాల ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ జి.వి.రంగారెడ్డి తదితరుల నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించారు. గురువారం అన్నదాత, వర్క్ ఫ్రం హోం, వేదాంతం, శుక్రవారం (అ)సత్యం, అనశ్వరం, బ్రహ్మస్వరూపం, శనివారం 'విడాకులు కావాలి', 'దేవరాగం' నాటికలు ప్రదర్శించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని ప్రముఖ (మిగతా 2లో)

పదిలో మెరుగైన ఫలితాలే లక్ష్యం

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- నూరు రోజుల ప్రణాళిక సిద్ధం
- కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను తీర్చిదిద్దడానికి నూరు రోజుల ప్రణాళికను సిద్ధం చేసినట్లు కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించేలా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేక శిక్షణ వల్ల విద్యార్థులందరికి మేలు జరుగుతుందన్నారు. పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సన్నద్ధత, పరీక్షా కేంద్రాల గుర్తింపు తదితర వివరాలను ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు.

ప్రశ్న: ఈ విద్యా సంవత్సరంలో కృష్ణాజిల్లాలో ఎందరు విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు?

జవాబు: జిల్లాలో 323 ప్రభుత్వ పాఠశాలల్లో 10,860 మంది, 180 ప్రయివేటు పాఠశాలల్లో 9,954 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం, మార్కులు, ర్యాంకులు పెంచేందుకు నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం.

ప్రశ్న: మెరుగైన ఫలితాలకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: డిసెంబర్ ఒకటో తేదీ నుంచి మార్చి పదో తేదీ వరకు నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. స్కూల్‌లోని పది విద్యార్థులను ప్రతి రోజు ఉదయం ఒకగంటపాటు ఒక సబ్జెక్టును చదివిస్తున్నాం. ఈ చదివిని సబ్‌జక్టుపై సాయంత్రం టెస్టులు నిర్వహిస్తున్నాం. టెస్టులు రాసిన విద్యార్థుల్లో ఎవరు ఏ సబ్‌జెక్టులోఎన్ని మార్కులు సాధిస్తున్నారో గుర్తిస్తున్నాం. వెనుబడిన సబ్‌జక్టుల్లో ప్రత్యేకశిక్షణ ఇస్తున్నాం. వెనుకబడిన సబ్‌జక్టుల్లో ఉత్తీర్ణత మార్కులు పెంచేందుకు విద్యార్థులను సాయంత్రం మరొక గంట అదనంగా చదివిస్తున్నాం.

ప్రశ్న: విద్యార్థులకు స్టడీ మెటీరియల్, అల్పాహారం అందించారా?

జవాబు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడానికి కృషి చేస్తున్నాం. దీనిపై జిల్లా పరిషత్ అధికారులను సంప్రదించాం. సంక్రాంతి తర్వాత ప్రతి పాఠశాలకు పదో తరగతి పరీక్షలకు ఉపయోగపడే రెండు పుస్తకాలను జిల్లా విద్యాశాఖ నుంచి (మిగతా 2లో)

హైందవ శంఖారావం సైడ్ లైట్స్

ప్రజాశక్తి-గన్నవరం

విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు రేంజి డిఐజి పరిధిలోని మూడు వేల మంది పోలీసులను బందోబస్తుకు ఏర్పాటు చేశారు. రూట్ మ్యాప్‌లకు అనుగుణంగా వాహనాలను అనుమతించారు. రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. బుక్ స్టాల్స్, మెటీరియల్ విక్రయాల వద్ద హిందూ మత, ఆధ్యాత్మిక పుస్తకాలను విక్రయించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని నాలుగు జిల్లాల నుంచి స్కూళ్ళు, కళాశాలలు, ఆర్టీసీ బస్సుల్లో జనాలను కేసరపల్లికి తరలించారు. విమానాశ్రయం ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ పెద్ద ఎత్తున స్తంభించిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంచినీళ్లు, ఆహారం అందక చాలామంది ఆకలికి అల్లాడారు. సభలో మాట్లాడిన స్వామీజీలు అయోధ్యల అన్ని ఆలయాలను హిందూ సమాజానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హిందూ ఆలయాల కింద ఉన్న భూముల వివరాలను ఆ ప్రాంతంలోని మహిళలు వెలికితీయాలని హిందూ సమాజానికి చెప్పాలని రెచ్చగొట్టారు. ప్రతి ఇంట్లో ఆడపిల్లలకు వేద పఠనం నేర్పాలని హిందూ తత్వాన్ని ప్రేరేపించారు. సినీ రచయిత అనంత శ్రీరామ్ అన్యమతస్తుల వల్ల హిందూతత్వానికి అన్యాయం జరుగుతుందని మతాల చిచ్చురేపే వ్యాఖ్యలు చేశారు. జనాలను కంట్రోల్ చేయడానికి పోలీసులు నానా తంటాలు పడ్డారు. భోజనాల కోసం టెంట్లలో తోపులాట జరిగింది.

సభా ప్రాంగణం వద్ద ఉన్న స్కూలు బస్సులు

ఎమర్జెన్సీ వైద్య సేవల్లో ఆధునిక ఆవిష్కరణలు

- అత్యవసర సమయంలో ప్రతి క్షణం కీలకమే
- కామినేనిలో అంతర్జాతీయ స్థాయి అత్యవసర చికిత్సా విభాగం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక ఆవిష్కరణల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్సలు అందించే అవకాశం లభిస్తోందని కామినేని హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్ అన్నారు. కామినేని హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ చికిత్సల నిర్వహణపై అకడమిక్ సీఎంఈ ప్రోగ్రాం నిర్వహించారు. కామినేని హాస్పిటల్స్‌లో ఆదివారం జరిగిన ఈ సదస్సులో డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్ ప్రసంగిస్తూ అత్యవసర సమయంలో ప్రతి క్షణం కీలకమేనని, సత్వర స్పందనతో పాటు ప్రభావవంతమైన చికిత్సలను అందించడం ద్వారా రోగి ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. రోగి పరిస్థితిని కచ్చితంగా నిర్ధారించి, అవసరమైన నిపుణుల నేతత్వంలో చికిత్సలను అందించాల్సి ఉంటుందని వివరించారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు, సాంకేతిక సంపత్తి అందుబాటులో ఉంటే అత్యవసర పరిస్థితులను సక్రమంగా నిర్వహించవచ్చని అన్నారు. కామినేని హాస్పిటల్స్ లోని అత్యవసర చికిత్సా విభాగంలో అంతర్జాతీయ స్థాయి వైద్య పరికరాలు, అత్యంత అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని తెలియజేశారు. డయాగ్నస్టిక్ సర్వీసులు, కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, రేడియాలజీ, ఆంకాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ తదితర మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలతో కామినేని హాస్పిటల్స్ నందు అత్యున్నత ప్రమాణాలతో వైద్య చికిత్సలందిస్తున్నట్లు డాక్టర్ వర్ధన్ వెల్లడించారు. తొలుత, డాక్టర్ టి.వి. నారాయణరావు, రిటైర్డ్ ఎడిషనల్ డీఎంఈ డాక్టర్ సూర్యశ్రీ, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎన్ పవన్ కుమార్, సీనియర్ పర్మనాలజిస్ట్ డాక్టర్ వినతి, కామినేని క్లస్టర్ హెడ్ సునీల్ తదితర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు వెయ్యి మంది ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితుల నిర్వహణ గురించి సమగ్రంగా చర్చించారు. వ్యాధి నిర్ధారణ, పలు రకాల చికిత్సల గురించి వివిధ విభాగాల నిపుణులు విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. సంబంధిత అంశాలపై సభ్యుల సందేశాలను నివత్తి చేశారు. కామినేని క్లస్టర్ హెడ్ సునీల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సీఎంఈ ప్రోగ్రాంకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ రెండు క్రెడిట్ పాయింట్లను కేటాయించినట్లు తెలిపారు. నవీన ఆవిష్కరణలు, చికిత్సా విధానల గురించి వైద్యులకు అవగాహన పెంపొందింపజేసేందుకు కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అనేక సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు. ఇటువంటి వైద్య విజ్ఞాన సదస్సుల నిర్వహణ ద్వారా ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించేందుకు అవకాశం లభిస్తుందని సునీల్ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ప్రజా ఉద్యమాలకు అనుకూలం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

వ్యవస్థ క్రమంగా బలహీనపడుతోందన్నారు. ఉత్పత్తి రంగం పూర్తిగా దెబ్బతిందని, దీంతో పరిశ్రమలు మూతపడుతున్నాయని, రాష్ట్రంలోకి పెట్టుబడులు రావడం లేదని అన్నారు. ఈ పరిస్థితులను అందిపుచ్చుకుని ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో కిడ్నీ వ్యాధి మరణాలు, విజయవాడలో కృష్ణా నది కరకట్ట రిటైనింగ్ వాల్ నిర్మాణం, చెత్త పన్నుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు మంచి ఫలితాలను ఇచ్చాయన్నారు. బుడమేరు, కృష్ణానది వరద బాధితుల కోసం పార్టీ శ్రేణులు చేపట్టిన సహాయ చర్యలు అభినందనీయన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు ముగింపు ఉపన్యాసం చేస్తూ కమ్యూనిస్టులకు ఓట్లు సీట్లు ముఖ్యం కాదని, దోపిడి వర్గాల నుండి దోపిడీకి గురయ్యే ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తారని, అందులో ప్రధానంగా సిపిఎం ముందుంటుందని, కమ్యూనిస్టు వ్యతిరేకులు దీనిని గమనించాలని అన్నారు. కార్మికులు, కర్షకులు, నిరుద్యోగులు, మహిళలు ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కనీస వేతన చట్టం అమలు చేయకపోవడంతో కార్మికులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టులకు సానుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసి ఎన్టీఆర్ జిల్లాలో సిపిఎం విస్తరణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నాయకులు బి.అర్.తులసీరావు, పిన్నమనేని మురళీకృష్ణ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు పాల్గొన్నారు.

పలు తీర్మానాలు ఆమోదం

తిరువూరులో నిర్వహించిన సిపిఎం 25వ జిల్లా మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. జిల్లాలో 1.07 హెక్టార్లకు సాగు నీరు అందించాలని, చింతలపూడి, వేదాద్రి, ముక్త్యాల ప్రాజెక్టులను పూర్తి చేయాలని, సుబాబుల్ పంటకు గిట్టుబాటు ధర కల్పించి జిల్లాలో కాగితం పరిశ్రమ ఏర్పాటు చేయాలని, నందిగామ ప్రాంతంలో దుస్తుల పరిశ్రమ ఏర్పాటు చేయాలని, జగ్గయ్యపేట సమీపంలో గండ్రాయి వద్ద ఏడాదికి రెండు వేల ఉత్పత్తి సామర్థ్యం గల ఇనుప ఖనిజపు గనులను విశాఖ ఉక్కుకు కేటాయించాలని తీర్మానించారు. బుడమేరు వరద నివారణకు ఏసి మిత్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, విజయవాడ నగరం, దాని పరిసర ప్రాంతాల్లో కనీసం 30 వేల క్యూసెక్కుల నీరుపోయే విధంగా బుడమేరు లోతును, వెడల్పును పెంచి కాంక్రీట్ రిటైనింగ్ వాల్ నిర్మించాలని, జిల్లాలో ప్రతి పట్టణానికి, గ్రామానికి కృష్ణానది నీటిని అందించాలని, తిరువూరు నుండి మైలవరం మీదుగా గ్రామాలను కలుపుతూ విజయవాడకు, జగ్గయ్యపేట నుండి గ్రామాన్ని కలుపుతూ విజయవాడకు మెట్రో రైల్వే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, తిరువూరు ప్రాంతంలో అత్యధికంగా మైకా నిక్షేపాలు ఉన్నాయని, ఈ ప్రాంతంలో మైకాను ఉపయోగించే విద్యుత్ పరికరాల తయారీ, కాస్మోటిక్ పరిశ్రమలను ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించాలని మహాసభలో తీర్మానం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, భవనిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పని చేయించి కార్మికులకు పరిహారం అందించాలని, జిల్లాలో దశాబ్దాలుగా పేదల సాగు చేస్తున్న పోరంబోకు, బంజరు, రెవెన్యూ పోరంబోకు, అసైన్ భూముల సమస్యలు పరిష్కరించి వారికి హక్కులు కల్పించాలని, విజయవాడ కొండ ప్రాం తాలు, మైదాన ప్రాంతాలు, జిల్లా పరిధిలో 17 నియోజకవర్గాల్లో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న సుమారు రెండు లక్షల కుటుంబాల వారికి ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయించాలని, పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీ ణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు కృష్ణాజలాలు పంపిణీ చేయాలని, సిమెంటు, కెమికల్ ఫ్యాక్టరీలో ఉన్న జగ్గయ్యపేటలో కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని మహాసభ తీర్మానించింది.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-తాడేపల్లి: సుందరయ్యగర్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహ పూరిత వాతవరణంలో జరిగాయి. బాలలు, పెద్దలు పోటీపడి మరీ ఆటపాటల్లో పాల్గొన్నారు. దాదాపు 400 మంది మహిళల రంగవల్లులు, బాలల కేరింతలతో ఈ సంబరాల్లో పాల్గొన్నారు. నిర్వాహకులను అభినందించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్ బత్తుల రాజు భవన్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 10 రకాల ఆటల పోటీలను మహిళా సంఘం, యువజన సంఘం, ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు నిర్వహించారు.మహిళలకు ముగ్గుల పోటీలు, టగ్గాఫ్‌వార్, వాటర్ ఫిల్లింగ్, పిల్లలకు రన్నింగ్ రేస్, స్కిప్పింగ్, బకెట్ ఇన్ వాటర్, యువకులకు ఉట్టి కొట్టుడు, వంటి పది రకాల ఆటలను నిర్వహించారు. పండుగ వాతావరణం తలపించేలా షుమారు400 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ ఆటల పోటీలను సిపిఎం సీనియర్ నాయకులు పి రామచంద్రరావు ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉత్సాహపూరితమైన వాతావరణంలో మహిళలు, పిల్లలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమం లో మహిళా సంఘం తాడేపల్లి పట్టణ నాయకురాలు పి.గిరిజ, గోవిందమ్మ, అంజలి, సుధ, ప్రజానాట్యమండలి తాడేపల్లి పట్టణ నాయకులు కొట్టే కరుణాకర రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం తాడేపల్లి పట్టణం గౌరవ అధ్యక్షులు సిహెచ్ భుజంగరావు, బి శేఖర్, సాయి, ఫణి, సుబ్బయ్య, శ్యామ్, వెంకటేశ్వర్లు, బి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కథా నాటికల పోటీలు

సాహితీవేత్త తంగిరాల వెంకటసుబ్బారావుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రముఖ సాహితీవేత్త, అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే జ్ఞానపీఠ అవార్డు మాదిరిగానే తెలుగువారికి అజో-విభో-కందాళం ఫౌండేషన్ పురస్కారాన్ని ఇస్తోందన్నారు. తంగిరాల వెంకటసుబ్బారావు తెలుగు, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో సుమారుగా వంద పరిశోధనా పత్రాలను సమర్పించారన్నారు. ఆయన పర్యవేక్షణలో 15 మందికి పిహెచ్‌డిలు, 25 మందికి ఎంఫిల్‌లు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, సాహితీవేత్త అల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, సీనియర్ జర్నలిస్ట్ రెంటాల వెంకటేశ్వరరావు, ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, పలువురు సాహితీ కళా నాటక రంగ సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలే లక్ష్యం

అందించడానికి చర్యలు తీసుకుటున్నాం. ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో అదనంగా ఉండాల్సి వస్తోంది. దీన్ని గుర్తించాం. తాగునీటి సౌకర్యం పాఠశాలల్లో ఉంది. ఉదయం రోజు విడిచి రోజు రాగిమాల్ట్ మెనూలో ఉంది. సాయంత్రం అల్పాహారం అందించడానికి దాతలను సంప్రదిస్తున్నాం.

ప్రశ్న: పది పరీక్షలు నిర్వహించడానికి ఎన్ని కేంద్రాలను గుర్తించారు?

జవాబు: పది పరీక్షలకు జిల్లాలో 144 సెంటర్లు గుర్తించాం. 69 జోన్లలో ఈ సెంటర్లున్నాయి. ఏబిసిడి కేంద్రాలుగా వర్గీకరించాల్సి ఉంది. కేంద్రాల్లో కాపీయింగ్, పేపర్ లీకేజీలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉంటుంది. విద్యాశాఖ ఉన్నత అధికారులు మార్గదర్శకాలకు అనుగుణంగా సమస్యాత్మక కేంద్రాలు, ఇతర కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. వేసవిలో తాగునీటి సమస్య ఎదురవకుండా పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం.

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT GUDIVADA
I.A.No.75/2024 IN O.S.NO.80/2024

Between:
Tana Satyanarayana :::Pet/Plaintiff
And
Thota Naveen Kumar, S/o. Thota Prasad, Hindu, aged about 46 Years, Business, R/o D.No.7/298, 7/299, market Center, Gudivada, Krishna District, Cell No.Non Known ::: Res/Defendant

పై నెంబరు I.A.లో Respondent/ Defendant కి శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ ఉత్తర్వులు (Substituted Service) ఇచ్చినందున పై నెంబరు I.A.లో ఏదైన అక్షేపములు యున్నయెడల ది. 03-02-2025వ తేదీన ఉదయం 10.30 ని॥ లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా న్యాయవాది గారి ద్వారా హాజరై అక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షములో తీర్మానించబడును.

Adjournment Date 03-02-2025

Kambhampati Ravi
G.J.William
Advocate, Gudivada
Cell No.9885074158

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT GUDIVADA
O.S.NO.80/2024

Between:
Tana Satyanarayana :::Plaintiff
And
1. Thota Naveen Kumar, S/o. Thota Prasad, Hindu, aged about 46 Years, Business, R/o D.No.7/298, 7/299, market Center, Gudivada, Krishna District, Cell No. Non Known ::: Defendant

పై నెంబరు దావాలో Defendant కి శ్రీ కోర్టు వారు ప్రత్యేమ్నయ ఉత్తర్వులు (Substituted Service) ఇచ్చినందున పై నెంబరు దావాలో ఏదైన అక్షేపములు యున్నయెడల ది.03-02-2025వ తేదీన ఉదయం 10.30 ని॥ లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా న్యాయవాది గారి ద్వారా హాజరై అక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షములో తీర్మానించబడును.

Adjournment Date 03-02-2025

Kambhampati Ravi
G.J.William
Advocate, Gudivada
Cell No. 9885074158

మెట్లపల్లిలో 'పులి' కలకలం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం మెట్లపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలకు పులి, పిల్లలు కనిపించడం కలకలం రేపింది. ఇటీవల గ్రామంలోని అటవీ ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు పెట్టిన ఉచ్చులో పడి చిరుత పులి మరణించిన విషయం తెలిసిందే. అప్పట్లో కొండపై పులులు ఉన్నాయని కొంతమంది రైతులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఓ పులి, దాని పిల్లలతో కలిసి రోడ్డు దాటడం ఓ ఆర్ టి సి కండక్టర్ కంటపడింది. భయంతో వణికిపోయిన కండక్టర్ పులికి కనిపించకుండా తప్పించుకొని మెట్ల పల్లి గ్రామంలోకి పారిపోయాడు. పులి దాని పిల్లల విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో పాటు ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పెలి కనిపించిందని తెలియడంతో మెట్లపల్లి గ్రామంలో టెన్షన్ చోటుచేసుకుంది. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు ఆలోచిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు పులిని పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంటుందని రైతులు అంటున్నారు.

ఎదురుగా పులి పిల్లలు వెళ్ళాయి.. రవికిరణ్, కండక్టర్,

మెట్లపల్లికి ఊరు బయట పామాయిల్ తోట వద్ద నుండి కొండగట్టు పైకి తెల్లవారుజామున 3 గంటలకు పులి, దాని పిల్లలు రోడ్డు దాటడం చూశానని ఆర్టీసీ కండక్టర్ రవికిరణ్ చెప్పారు. హనుమాన్ జంక్షన్-ఆగిరిపల్లి సర్వీస్ కండక్టర్ గా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఉదయం నాలుగు గంటలకు డ్యూటీ ఎక్కాల్సి రావడంతో మూడున్నర గంటలకు ఆగిరిపల్లి మండలం కనసనపల్లి పక్కనే ఉన్న ఊర్లో నుంచి బైక్ పై గన్నవరం వస్తుండగా మెట్లపల్లి ఊరు బయట పామాయిల్ తోట నుంచి పులి పిల్లలు రోడ్డు దాటడం కనిపించింది. వాటికి ముందు పెద్దపులి వెళ్లినట్లుగా అనిపించింది. పులి పిల్లలు చూడగానే భయంతో వణికిపోయి బండిని వేగంగా నడిపించి గ్రామంలోకి వెళ్లిపోయానని చెప్పాడు. ఈ విషయాన్ని మెట్లపల్లి గ్రామస్తులతో పాటు ఆగిరిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపాడు. మెట్లపల్లి అటవీ ప్రాంతంలో ఇంకా పులులు తిరుగుతున్న మాట వాస్తవం అనేది ఈ సంఘటనతో బయటపడింది.

రవికిరణ్, కండక్టర్

నాటి ఉపాధ్యాయులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సెయింట్ జాన్స్ పాఠశాలలో 1999-2000లో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సాహంగాను.. ఉల్లాసంగానూ పూర్వ విద్యార్థులు గడిపారు. నాటి విద్యార్థులు కలుసుకుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన చదివిన పాఠశాలను, స్నేహితులను మర్చిపోకూడదని అంటూ గీతాలాపన చేశారు. సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్. సంతోష్ కుమార్, పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రెసిడెంట్ కె వాసు , ఎగ్జిక్యూటివ్ మెంబర్ వై హరివిశ్వనాథ్ , జనరల్ సెక్రటరీ బి నరేంద్ర కుమార్ , రెవ. బ్రదర్. కె.యం. జోసఫ్ , రెవ. బ్రదర్. బాలశౌరి, రెవ. బ్రదర్. జిమ్మి కురియోకోస్, రెవ. బ్రదర్. భల్లా జోసఫ్ పాల్గొన్నారు

శ్రీకాకుళేశ్వర స్వామిని దర్శించుకున్న బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని ప్రాచీన దేవస్థానం ఆంధ్ర మహావిష్ణువుగా భాసిల్లుతున్న శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఆదివారం దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత అగ్నిహోత్రం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులచే లక్ష తులసి పూజ, నవ గ్రహ హెూమం, శాంతి కళ్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దేవస్థానానికి విచ్చేయగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ చందన అలంకరణ శోభితుడైన స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అధికారులు, వేద పండితులు ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదం అందించారు.

సర్పంచ్ చొరవతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి సర్పంచ్ చొరవతో కాలువగట్టు రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. మోపిదేవి హరిజనవాడ నుండి కాలవ గట్టు రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేసి సర్పంచ్ నందిగం మేరీ రాణి ప్రజల మన్ననలు పొందారు. మోపిదేవి దళితులు కాలువ గట్టు మీద నడవడానికి ఇబ్బందిగా ఉందని సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు.. దీనిపై స్పందించిన సర్పంచ్ పంచాయతీ నిధులతో ప్రొక్లైన్ పెట్టి కాలువ గట్టు పై ఉన్న చెట్లు పిచ్చి మొక్కలను తొలగించి, గుంటలను మెరక తో చదును చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నందిగం అభిషేక రావు, శ్రీను, శ్రీనివాసరావు, మునేశ్వరరావు, కిషోర్ బాబు, కోరాబత్తిన శ్రీనివాసరావు దోవారి కోటేశ్వరరావు, కర్లపూడి తంబాల సుబ్బారావు తదితరులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలం ముల్లపర్రు గ్రామంలో వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణలో ఆయన తనయుడు వంగవీటి రాధా పాల్గొన్నారు. గ్రామస్తులు బంటుమిల్లి హైవే నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కష్ణప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాసు, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వంగవీటి రాధా

రోగులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 740 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ హనుమకొండ దుర్గ భవాని, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగం శెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి గుడివాడ హెూమియో వైద్యులు పి భవాని, తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

తంబి నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : నిరీక్షణ క్రైస్తవ జీవిత సత్యం అని, ఈ లోకంలో మనం జీవించే మంచి జీవితం అదే అని రెవ ఫాదర్ సూరేపల్లి ఐజాక్ అన్నారు. బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి సందర్భంగా నవదిన ప్రార్థనలో భాగంగా ఆదివారం రెండో రోజు ఖమ్మం మేత్రాసనం వారి ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో ఐజాక్ పాల్గొని పూజా బలిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గురువులు, కన్యా స్త్రీలు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. పూజానంతరం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గురువులకు సన్మానాలు చేశారు.

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 100 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వల్లభనేని వీరభద్రరావు వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు రామకష్ణ వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే స్థానిక బిసి బాలికల వసతి గహంలోని 85 మంది విద్యార్థినలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, లైన్స్ క్లబ్ సభ్యులు పొట్లూరి రవి, జి రామకష్ణ, పరంధామయ్య, సుధాకర్, చిట్టిబాబు, శివప్రసాద్, బాలాజీ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం విఎన్ పురం కాలనీ సెకండ్ రోడ్ లో నంది పాముల రాంబాబు (37) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. ఎస్పై ప్రేమ్ కుమార్ కథనం ప్రకారం భార్యభర్తలు గొడవలు పడుతుండడతో రెండు రోజుల నుండి మద్యం తాగుతున్నాడు. భార్య తిట్టిందని రాంబాబు క్షణకావేశంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో తన ఇంట్లో ఉరి పెట్టుకోని చనిపోయాడు. మృతదేహాన్నిగన్నవరం గవర్నమెంట్ హాస్పటల్ తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

గుడివాడలో చిన్నారిపై అత్యాచారం

- ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - గుడివాడ : అభం శుభం తెలియని చిన్నారులపై అత్యాచారాలు నానాటికి పెరిగిపోతున్నాయి. వివరాల్లోకెళితే కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని రైలుపేటలో శనివారం రాత్రి 5 సంవత్సరాల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు ఓ కామాంధుడు. 42 సంవత్సరాల వయస్సున్న ఎండూరి జోజిబాబు బాలిక ఇంటి సమీపంలోని ఓ రైసు మిల్లులో ముఠా కార్మికుడిగా పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి బాలికపై అత్యాచారానికి పాల్పడగా బాలిక తల్లిదండ్రులు కుమార్తెను గుడివాడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం టూటౌన్ పోలీసు స్టేషన్లో కేసు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం గుడివాడ ఇన్‌ఛార్జి డిఎస్పీ అబ్దుల్ సుబాన్ రైలు పేటలోని బాలిక ఇంటి వద్ద స్వయంగా విచారణ చేపట్టి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి ఎండూరి జోజి బాబు గుర్తింగా కామాంధుడిని అదుపులో తీసుకున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. ఏపీలో చిన్నారులపై దాడులు ఆగడం లేదని అధికారులు కఠిన చర్యలు ఎన్ని తీసుకుంటున్నా మానవమగాల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని ఎక్కడోచోట చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తునే ఉన్నాయని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చెందుతున్నాయి. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ఐద్వా

బాలికపై జరిగిన అత్యాచారాన్ని ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని తీవ్రంగా ఖండించారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయని, వీటిని నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, నాయకులు సమీర్ పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని లక్ష్మీపతి మృతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం సిపిఎం సానుభూతి పరుడు జిల్లా పరిషత్తు రిటైర్డ్ ఉద్యోగి తంటిపూడి లక్ష్మీపతి ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన మృతి పట్ల సిపిఎం మచిలీపట్నం నగర కమిటీ లక్ష్మీపతి మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు సిహెచ్ జయరావు టి చంద్రపాల్, కె శర్మ, పార్టీ సభ్యులు సిహెచ్. బాబురావు తదితరులు ఉన్నారు.

విజయవంతంగా మహాసభలు

లక్ష్మణరావును సన్మానిస్తున్న దృశ్యం

కోలాటం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు సుగాలి కాలనీలో గల సంకా నరసింహారావు ఫంక్షన్ హాల్‌లోని సీతారాం ఏచూరి నగర్‌లో సిపిఎం 25వ ఎన్టీఆర్ జిల్లా మహాసభలు ఎంతో అట్టహాసంగా శనివారం ప్రారంభమై ఆదివారం ఉత్సాహంతో ముగిశాయి. మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం, బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆ పార్టీ తిరువూరు పట్టణ కమిటీ సభ్యులు కార్యకర్తలు మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు నెలరోజులపాటు అహర్నిశలు కృషి చేశారు. ఈ సందర్భంగా శుక్ర వారం మహాసభల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన భారీ ప్రజా ర్యాలీ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. శనివారం, ఆదివారం మహాసభకు జిల్లా నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులకు ఏ విధమైన అసౌకర్యం లోటుపాట్లు తలెత్తకుండా పార్టీ కార్యకర్తలతో పాటు సానుభూతిపరులు కూడా వాలంటీర్లుగా సేవలందించారు. కొంతమంది కుటుంబ సభ్యులతో వచ్చి సర్వీస్ అందించారు. వాలంటీర్లు దగ్గరుండి కల్పించారు. సుందరయ్య కాలనీకి చెందిన చిన్నారులు మహిళలు కోలాటం నృత్యాలను నిర్వహించి ప్రతినిధులను ఆదరించారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు అప్పన్న, పంబి వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, కళాకారులు పి.తులసీరాణి ఎం.నాగమణి, ఎం.లక్ష్మి, ఎల్.రాణి, రాజేశ్వరి విప్లవ గీతాలను ఆలపించారు. 1964లో ఆవిర్భవించిన సిపిఎం జిల్లా మహా సభలను తొలిసారిగా తిరువూరులో జరుగుతుండటంతో కార్మికులు కర్షకులు వ్యాపారులు, చిరువ్యాపారులు, ఉద్యోగులు, సానుభూతిపరులు

నాయకులు కార్యకర్తలు ఆర్థిక సహాయ సహకారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారందరికీ సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, నాగేశ్వరరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంచి ఆతిథ్యం ఇచ్చి మహాసభలను విజయవంతమయ్యేందుకు కృషిచేసిన ఆహ్వాన సంఘం బాధ్యులను, వాలంటీర్లను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అభినందించారు. ముఖ్యంగా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులు సేవలు కూడా మరువలేని నాయకులు కొనియాడారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పంతంగి శ్రీనివాసరావు, మోటూరు చింతయ్య, ఆకుల రవి, చెరుకు సత్యనారాయణ, ఎస్.కె నాగుల్ మీరా, సప్పిడి సురేష్‌తో పాటు ఆగిరిపల్లి జయకృష్ణ, తుపాకుల కృష్ణ, కూరపాటి వెంకటరత్నం, నూకల సత్యనారాయణ, ఎస్వీ భద్రం, మరకాల ప్రకాశరావు, ఇశ్రాయేలు, ఎం.లక్ష్మి, ఎస్‌కె.ఖదీర్, మస్తాన్, చెరుకు మోహన్ కృష్ణ, షేక్ జాన్ మియా, మేడూరు రమేష్, అరవపల్లి మురళీమో హన్, మంగళగిరి తిరుపతిరావు, అప్పారావు, ఉమా మహేశ్వరరావు, రాజశేఖరరెడ్డి, నాగరాజు రామకృష్ణ తదితరులు మహాసభలు విజయ వంతంగా జరిగేందుకు కృషి చేశారు.

మహాసభకు 182 మంది ప్రతినిధులు హాజరు

ప్రజాశక్తి - విజయవాడ : సిపిఎం ఎన్‌టిఆర్‌జిల్లా మహాసభలకు విజయవాడ జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల నుంచి 182 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో 143 మంది పురుషులు కాగా, మరో 39 స్త్రీలు. మహాసభలకు హాజరయిన ప్రతినిధుల్లో అతి చిన్న వయస్సు 25 సంవత్సరాల సిహెచ్.వెంకటేశ్వరరావు (ఎస్ఎఫ్ఐ), ఆ తరువాత 26 సంవత్సరాల ఎస్.ప్రణయ్, అత్యధిక వయస్సు 80 సంవత్సరాల జి.చినబాబు, ఆ తరువాత 76 సంవత్సరాల మాధవరెడ్డి, దార నాగేశ్వరరావు ఉన్నారు. 9 మంది నిరక్షరాస్యులు కాగా, 5వ తరగతిలోపు చదువుకున్న వారు 22 మంది, 6వ తరగతి నుంచి 10 వ తరగతి లోపు 53 మంది, ఇంటర్ 21 మంది, ఐటిఐ/డిప్లమో/ వృత్తివిద్య ఎనిమిది మంది, డిగ్రీ 35 మంది, పి.జి 17 మంది, ఆపైన చదవిన ప్రతినిధులు ఇద్దరు ఉన్నారు. కార్మికవర్గం నుంచి 54 మంది హాజరుకాగా, వ్యవసాయ కార్మిక 37 మంది, పేద రైతు వర్గం నుంచి 27 మంది, మధ్యతరగతి నుంచి 26, ధనిక రైతు ముగ్గురు, చేతివృత్తి 11 మంది, పట్టణ మధ్య తరగతి నుంచి 12 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. ఎస్‌సి సామాజిక తరగతి నుంచి 42 మంది, ఎస్‌టి ముగ్గురు, బిసి 72, ఒ.సి 50, ముస్లి ఐదుగురు, క్రిస్టియన్ సామాజిక తరగతి నుంచి ఎనిమిది మంది హాజరయ్యారు. జైలు జీవితం, అజ్ఞాత జీవితం అత్యధిక కాలం గడిపిన ప్రతినిధుల్లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు 29 రోజులు, ఎక్కువ కేసులున్న ప్రతి నిధుల్లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ 31 కేసులు, 42 మందిపై వివిధ కేసులు నమోదయిన వారున్నారు. ఎక్కువ మహా సభల (13)కు హాజర యిన వారిలో జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ ఉన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలకు కుటుంబాల నుంచి హాజరయిన ప్రతినిధులు వీరే...

సిపిఎం 25వ ఎన్‌టిఆర్ జిల్లా మహాసభలకు ఆయా డివిజన్ల పరిధిలోని వారి వారి కుటుంబాల నుంచి ఇద్దరు, ముగ్గురు ప్రతినిధులుగా హాజరయ్యారు. జిల్లా కేంద్రం నుంచి ఎంవి ఆంజనేయులు, కె శ్రీదేవి (భార్య, భర్త), ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సుప్రజ (భార్య, భర్త), ఎ వెంకటేశ్వరరావు, ఎ కమల (భార్య, భర్త), చింతల శ్రీను, అరుణ (భార్య, భర్త, విజయవాడ సెంట్రల్) , ఇవి నారాయణ, ఇ సురేష్ (అన్న , తమ్ముడు-విజయవాడ), పి పిచ్చమ్మ, పి వెంకటరెడ్డి (తల్లి, కొడుకు -విజయవాడ సెంట్రల్), వజ్రాల వెంకటరెడ్డి , ధనలక్ష్మి (భార్య, భర్త, మైలవరం), ఎస్‌కె లాల్ అహ్మద్ గౌస్, చాంద్‌బేగం (భార్య, భర్త - వీరులపాడు), పంతంగి శ్రీనివాసరావు, తులసి (భార్య,భర్త-తిరువూరు), ఎం నాగేంద్రప్రసాద్, రవికుమారి (భార్య, భర్త -తిరువూరు), ఎస్ నాగేశ్వరరెడ్డి, ఎస్ కుమారి (భార్య, భర్త- తిరువూరు), ధనలక్ష్మి, రంగరాణి (తల్లి, కూతురు -విసన్నపేట), ఎస్ నాగమణి, ఎస్ ప్రణయ్‌తేజ (తల్లి, కొడుకు-జగ్గయ్యపేట), దంతాల రాజేశ్వరి, నరేంద్ర (తల్లి, కొడుకు-జగ్గయ్యపేట), కోట కృష్ణ, కోట రవి(తండ్రి, కొడుకు -జగ్గయ్యపేట) జిల్లా మహాసభలకు హాజరయ్యారు.

అనాధ బాలలకు సరుకులు వితరణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు బైపాస్ రోడ్డు, సూర్య రెస్టారెంట్ సమీపంలో ఉన్న పరిపూర్ణ సేవా సంస్థలోని అనాథ బాలలకు లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు మెల్విన్ జోన్స్ పుట్టినరోజు ఉత్సవాల సందర్భంగా 316 లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి వితరణతో నిత్యావసర సరుకులను అనాథ బాలలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరువూరు లయన్స్ క్లబ్ సభ్యులు పసుమర్తి వెంకటేశ్వరరావు, కంచర్ల ముత్యప్రసాద్, పరిపూర్ణ ట్రస్ట్ నిర్వాహకుడు సిరికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల ఎంపిపిఎస్ మెయిన్ అనుబంధ భవిత కేంద్రంలో ప్రపంచ అంధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల కోసం లూయిస్ బ్రెయిలీ రూపొందించిన 6 చుక్కల లిపి వల్ల ఎంతో మంది అంధులకు విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి షేక్ జాన్ బీ, ఎస్తేరురాణి, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని సిఎంఆర్ యూనివర్సిటీ బెంగళూరు మార్కెటింగ్ అడ్మిషన్స్ డైరెక్టర్ రాజ్‌కుమార్ చక్రవర్తి తెలిపారు. ఉపాధ్యాయుల శ్రమను మాత్రమే గుర్తించడం కాదని వారు చేసే గొప్ప పనికి కూడా గౌరవ ప్రశంసలు ఇవ్వాలని ఆయన సూచించారు. బందర్ రోడ్‌లోని మినర్వ గ్రాండ్ హోటల్లో సిఎంఆర్ యూనివర్సిటీ బెంగళూరు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రముఖ శ్రీ చైతన్య, నారాయణ, శారద, భవిష్య కళాశాలలకు చెందిన సుమారు 59 మంది అధ్యాపకులను యూనివర్సిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సిఎంఆర్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ రాజ్ కుమార్ చక్రవర్తి మాట్లాడుతూ సమాజంలో గొప్ప మార్పులు తీసుకురావడంలో ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర వహిస్తారని చెప్పారు. విద్యారంగంలో ఉపాధ్యాయులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సన్మాన కార్యక్రమంతో పాటు అవార్డులను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం శారద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ కరెస్పాండెంట్ జివి.రావు మాట్లాడుతూ తన 33 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో లక్ష మందికి పైగా విద్యార్థులకు విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికు తీసుకువెళ్లినట్లు తెలిపారు. అనంతరం యూనివర్సిటీ ప్రతినిధి దుర్గా రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను గౌరవించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు వారే సమాజ మార్గ నిర్దేశకులని పేర్కొన్నారు. తమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి

ప్రజాశక్తి-గుంటూరు: స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిణి సావిత్రిబాయి పూలే అని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ అన్నారు. సావిత్రిబాయిపూలే 193వ జయంతి వారోత్సవాల సందర్భంగా గుంటూరు నగరంలో బ్రాడీపేట ఆఫీసు, సుందరయ్యనగర్, అంబేద్కర్ నగర్‌లో కార్యక్రమాలు జరిగాయి. మహిళలకు చదువు కావాలని, చదువు ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలరని సావిత్రిబాయి పూలే ఎంతోమందికి చదువు నేర్పించడమే కాకుండా ఎన్నో స్కూళ్లను స్థాపించడంలో పూలే దంపతులు ఎనలేని కృషి చేశారన్నారు. ఆడపిల్లల చదువు కోసం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్తను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి అని అన్నారు. ఎన్నో అవమానాలను దాడులను ఎదుర్కొని కూడా మహిళా విద్యకోసం కృషి చేశారన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం ఎంతో మంచిది అని అన్నారు. ఈకార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు జి.రమణ, ఎ.కళ్యాణి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కె.పద్మ, అంగన్‌వాడీ నాయకులు టి.రాధా, సంధ్య, సుజనారాణి తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి

- సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

మాట్లాడుతున్న వై.నరసింహారావు

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్రంలో మత విశ్వాసాలను రెచ్చకొట్టేందుకు విశ్వహిందూ పరిషత్ ను ముందు పెట్టి బిజెపి వెనుక ఉండి నాటకం ఆడుతుందని, ఈ విషయాలను జనంలోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఎర్రజెండా నాయకులపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ఆదివారం గన్నవరం అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్లో జరిగిన పార్టీ మండల స్థాయి విస్తత సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. నరసింహారావు మాట్లాడుతూ హైందవ శంఖారావం పేరుతో కేసరపల్లిలో జరిగిన సభ ఉద్దేశం హిందూ తత్వాన్ని రెచ్చగొట్టడమే అన్నారు. హిందూ దేవాలయాల్లోని భూములు, ఆస్తులపై విశ్వహిందూ పరిషత్ కన్ను పడిందని, వాటిని చేజిక్కించుకోవడానికి దేవాలయాలను హిందూ సమాజానికి అప్పగించాలని నినాదం ముందుకు తెచ్చారని తెలిపారు. హిందూ సమాజం అంటే స్వామీజీల అని ప్రశ్నించారు. అన్ని మతాలు కలిసి సహజీవనం సాగిస్తున్న రాష్ట్రంలో హిందూతత్వం పేరుతో గొడవలు సష్టించాలని చూడడం సరికాదన్నారు. మత విశ్వాసాలను, రాజకీయాన్ని దేనికదిగా వేరువేరుగా ఉంచాలని పేర్కొన్నారు. మతాన్ని రాజకీయాలలోకి, పబ్లిక్లోకి తీసుకురాకూడదని సూచించారు. మతం వ్యక్తి ప్రైవేటు వ్యవహారంగా మాత్రమే చూడాలని మహాత్మాగాంధీ నిత్యం చెప్తూవచ్చారని గుర్తు చేశారు. అదే స్పూర్తితో బాబాసాహెబ్ అంబేద్కర్ సారధ్యంలో లౌకిక భారత రాజ్యాంగం రూపొందిందని చెప్పారు. కాని లౌకికతత్వానికే కొత్త వక్రభాష్యాలు కొందరు చెబుతున్నారని, లౌకికతత్వం మత విశ్వాసాలకు వ్యతిరేకం అన్న పెడార్థాన్ని ప్రచారం చేస్తున్నారని వివరించారు. వ్యక్తిగత విశ్వాసంగా ఉండే మతం విషయంలో మెజారిటీ, మైనారిటీ తేడాలు ముందుకు తెచ్చి ప్రజల సమైక్యతను దెబ్బ తీసి విద్వేషాలను రాజేస్తున్నారని మండిపడ్డారు. మత స్వేచ్ఛ ప్రజల వ్యక్తిగత హక్కు. అన్ని మత విశ్వాసాల ప్రజలకూ భరోసా కల్పించాల్సిన కేంద్రం మైనారిటీలమీద దాడులు చేస్తున్న దుష్ట శక్తులకు తోడ్పాటు ఇస్తున్న దన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని మత విద్వేషాలకు దూరంగా ఉండాలని చెప్పాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

10న వాహనాలు బహిరంగ వేలం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వాడుకలలో లేని, నిరుపయోగంగా ఉన్న నాలుగు చక్రాల వాహనాలను ఈనెల 10న బహిరంగ వేలం వేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ లో నిరుపయోగంగా ఉన్న బొలెరో, అంబాసిడర్, జీప్ మహేంద్ర వంటి 12 నాలుగు చక్రాల వాహనాలను ఈనెల 10వ తేదీ ఉదయం 11 గంటలకు మచిలీపట్నం కలెక్టరేట్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు 10వేల రూపాయల ధరావతు(డిపాజిట్) చెల్లించవలసి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు పరిపాలనాధికారి, జిల్లా కలెక్టర్ కార్యాలయం మచిలీపట్నంలోను, మరియు మొబైల్ నెంబర్. 98499 03967 సంప్రదించవచ్చునని తెలిపారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శనం చేసుకున్నారు. యాత్రికులు అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. యాత్రిలకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాట్లు నిర్వహించినట్లు తెలిపారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నిత్యావసర సరుకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగకు పేద ఆర్యవైస్య కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకలు పంపిణీ చేశారు. యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజ ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు పేద ఆర్యవైశ్య కుటుంబాలకు తోచిన విదంగా సాయం చేయాలన్న ఉద్దేశంతో నిత్యావసర సరుకలు పంపిణీ చేస్తున్నామన్నారు. స్థానిక తేజ డిజిటల్స్ ఆవరణలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఉయ్యూరు మండల యువజన సంఘం అధ్యక్షుడు పేరూరి నిఖిల్, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు కొల్లిపర హేమంత్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు, వాసవీ సేవాదళ్ జిల్లా చైర్మన్ నేరెళ్ల వేణు తదితరులు పాల్గొని సేవలందించారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా): కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.

అభాగ్యుల సేవలో ఐవిఎం ఫౌండేషన్



కేలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : అభాగ్యుల సేవలో ఐవీఎం ఫౌండేషన్ ముందుకు సాగుతోందని ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డలోని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆశ్రమంలో ఆదివారం ఐవీఎం నూతన సంవత్సరం-2025 క్యాలెండరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా చల్లపల్లి పరిసర ప్రాంతాల్లోని నిరుపేదలకు తమ సంస్థ ద్వారా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 300 మందికి పైగా నిరుపేద ప్రతిభవంతులైన విద్యార్థులకు ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యను ఉచితంగా అందిస్తూ వారి పురోభివద్ధికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. మానవాళి ఎదుర్కొన్న పెను విపత్తు కరోనా సమయంలో అవనిగడ్డ నియోజకవర్గంలో దాదాపు 30 వేల కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించినట్లు తెలిపారు. కరోనాలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఫ్రంట్ లైన్ వారియర్స్ కు ఎప్పటికప్పుడు మాస్కులు, శానిటైజర్లు, ఫేస్ షీల్డ్స్ సమకూర్చి వారంతా ధైర్యంగా కరోనాను ఎదుర్కొనేందుకు తమ వంతు ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. ఇటీవల కృష్ణా నదికి సంబంధించిన భారీ వరదల నేపథ్యంలో సర్వస్వం కోల్పోయిన దాదాపు పది లంక గ్రామాల వరద బాధితులకు నిత్యవసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు అందించినట్లు తెలిపారు. పేదల అవసరాలు గుర్తించి తమ వంతు సహాయ సహకారాలు అందించి అండగా నిలుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వేములపల్లి రోజా, ట్రస్టీలు ఎన్.ఫణి, జీ.ప్రసాద్, డాక్టర్ కే.శ్రీనివాస్, ఎన్ఆర్ఐ జీ.భరత్ పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. వల్లూరుపాలెం నుండి కంకిపాడు లాకులు వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు గుంతలు పూడ్చి అభివృద్ధి చేసే కార్యక్రమానికి చినపులపాక గ్రామం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా రూ. 40 లక్షలతో 6. 6 కిలోమీటర్లు మేర వున్న రోడ్డును ప్రభుత్వం అభివద్ధి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఆరు కోట్ల రూపాయలతో అభివద్ధి పనులు శంకుస్థాపనలు చేశామని, 27 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకర్, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జనసేనపార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, మండల టిడిపి అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

40 వేల సభ్యత్వాలు నమోదు లక్ష్యం : బొబ్బా గోవర్ధన్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజక వర్గంలో 40 వేల సభ్యత్వాలు నమోదు చేయాలనేదే టిడిపి లక్ష్యమని ఆ పార్టీ నేత ఎన్ఆర్ఐ బొ బ్బా గోవర్ధన్ తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అవనిగడ్డ నియోజకవర్గం లో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలో టిడిపి జనసేన బిజెపి కూటమి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయని, దీంతో ప్రజల్లో ప్రభుత్వం పట్ల పార్టీ పట్ల పెద్ద ఎత్తున సానుకూలత పెరిగిందని తెలిపారు. ఈ సానుకూలత కారణంగా ప్రజల స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే 32 వేల వరకు పైగా పార్టీ సభ్యత్వాలు నమోదయ్యాయని చెప్పారు. సభ్యత్వం తీసుకునే ప్రతి కార్యకర్తకు ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా అందిస్తున్నారని తెలిపారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలం మల్లంపూడి గ్రామ నూతన సచివాలయం కార్యాలయాన్ని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్, జనసేన కన్వీనర్ పంచకర్ సురేష్, గరికిపాటి శివ, మల్లంపూడి ప్రెసిడెంట్ రేవు శ్రీనివాసరావు, నీటి సంఘం ప్రెసిడెంట్ చింత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు..

ఆర్‌టిసి కాలనీ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న 300 మంది కార్మికులకు నివేశన స్థలాలు కేటాయించి ఆర్టీసీ కాలనీ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు ఆర్టీసీ బస్టాండ్ లో కార్మిక పరిషత్ జెండా దిమ్మెను ఎంఎల్‌ఎ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి పిల్లలకు పాఠశాలల సమయాల్లో బస్ సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరువూరుకు రైల్వే లైన్ రాబోతుందని, సిఎం చంద్రబాబు చొరవతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రైల్వే మార్గం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని ఎంఎల్‌ఎ తెలిపారు. తిరువూరు డిపో నుంచి గంగావతి, మంత్రాలయం బస్ సర్వీసులు కూడా పునరుద్ధరించనున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

లలిత కళల పరిశోధక విద్యార్థికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయం లలిత కళల (ఫైన్ ఆర్ట్స్) విభాగ పరిశోధన విద్యార్థి కొడాలి రవికుమార్ డాక్టరేట్ అందు కున్నారు. ఇబ్రహీం పట్నం మండలం ఈల ప్రోలు కొత్తూరుకు చెందిన కొడాలి జయమ్మ, సాల్మన్ రాజుల కుమా రుడు రవికుమార్ ఆచార్య మాచవరం ఆది నారాయణ పర్యవేక్షణలో చేసిన పరిశోధన ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ ది మీడియమ్స్ ఇన్ ఇండియన్ స్కల్ప్చర్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు గానూ రిజిస్ట్రర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్య ధనుంజయరావు జనవరి 2న విశాఖపట్నంలో డాక్టరేట్‌ను అందజేసినట్లు రవికుమార్ తెలిపారు.

పాత బిల్లులు చెల్లించి ఆదుకోండి

ప్రజాశక్తి - వత్సవాయి : టిడిపి ప్రభుత్వ హయాంలో 2014 - 19, సంవత్సరంలో ఎన్‌ఆర్ఇజిఎస్‌లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించి కాంట్రాక్టర్‌ను ఆదుకోవాలని బిసి సెల్ అధ్యక్షులు ఆవుల రామారావు కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడం వల్ల కొంతమంది కాంట్రాక్టర్లు పనులు చేసి వారి ఆస్తులు అమ్ముకున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో సిసి రోడ్లు, డొంక రోడ్లు, స్కూల్ భవనాలు డ్రైనేజీ పనులు చేశామని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు శాతం వడ్డీతో కలిపి బిల్లులు చెల్లిస్తామని సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని ఆరు నెలలైనా అమలు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ చొరవ చూపి బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేతన కొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆదివారం ఆవిష్కరించారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే ఏసుక్రీస్తు మాటను పాటిస్తూ, తోటివారికి చేత నైన సహాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సుమ లత, పెద్దలు అబ్రహం, యోబు, మాణిక్యాలరావు, ప్రభుదాస్, అనిల్, హరీష్, రవి, రాముడు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ కేశినేని చిన్ని, పశ్చిమ ఎంఎల్‌ఎ సుజనా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని కెబిఎన్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్‌ను, గోవ్యాస్కులర్ హాస్పిటల్ వారిని అభినందించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతు విజయవాడలోని పలు ప్రాంతాల్లో వెరికోస్ వెయిన్స్ సమస్యతో ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని, ఈ క్యాంపులో వెరికోస్ వెయిన్స్ సమస్యపై నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారని తెలిపారు. ఉదయం 9 గం.ల నుంచి సాయంత్రం 5 గంగల వరకు జరిగిన ఈ వైద్య శిబిరంలో రక్తపోటు, షుగర్, థైరాయిడ్, గర్భాశయ సమస్యలు, ఆర్థోపెడిక్, మానసిక సమస్యలకు నిపుణులైన వైద్యులు చికిత్సలను అందించి అవసరమైన

వైద్య శిబిరంలో ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే

వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ సాయి ఇంటర్నేషనల్ డెంటల్ అసిస్టెంట్ సర్జన్ ఎన్టీఆర్ ట్రస్ట్ డాక్టర్ బండ్లమూడి బసవేశ్వరరావు చౌదరి, ఎండో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సంపత్ వాదిత్య, డాక్టర్ సువర్ణ కుమారి ఎండి జనరల్, శంకర హాస్పిటల్ నేత్ర వైద్య బందం ఎన్డీయే కూటమి నేతలు నాగుల్ మీరా, ఎమ్మెస్ బేగ్, కొత్తపల్లి సుబ్బారాయుడు, ఉమ్మడి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల రమణ, కుప్పుల గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ కృష్ణా జలాలందించేందుకు కృషి

రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ఎంఎల్‌ఎ కొలికపూడి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎ.కొండూరు : జూన్ నెలాఖరి కల్లా ఎ.కొండూరు మండలంలోని ప్రతి ఇంటికి కృష్ణా జలాలను సరఫరా చేసి ఈ ప్రాంత ప్రజలకు ఎదుర్కొంటున్న కిడ్నీ వ్యాధి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని తిరువూరు ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని కంభంపాడులో రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అయన విలేకరులతో మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా ఎ.కొండూరు మండల ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతూ కిడ్నీ వ్యాధికి గురై కొన్ని వందల మంది మృతి చెందారని ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని 2014-19 సంవత్సరాల మధ్య అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు కృష్ణా జలాలను తాగునీరుగా అందించడానికి 50 కోట్లతో పనులు ప్రారంభించారని 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులను నిర్లక్ష్యం చేసిందని అన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పైప్‌లైన్ పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తున్నమన్నారు. ఎ.కొండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో 14 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం నూతనంగా చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. జూన్ నెల నాటికి గ్రామ పంచాయతీలతో పాటు గిరిజన తండాలకు కూడా కృష్ణ జలాలను తాగునీటి నిమిత్తం ప్రతి ఇంటికి సరఫరా

చేస్తామన్నారు. ఎస్సి ఎస్టి ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అంతకుముందు ఆయన వల్లంపట్ల గోపాలపురం అట్ల ప్రగడ కంభంపాడు పోలిశెట్టిపాడు కోడూరు మిగిలిన తొమ్మిది ట్యాంకులకు సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ చిన్నరాట్నాల ఆర్డబ్ల్యుఎస్ ఎఇ లక్ష్మి మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు అలానే టిడిపి మండల అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి డి.సి.కమిటీ చైర్మన్ కఠారి కోటేశ్వరరావు పోలిశెట్టిపాడు సర్పంచ్ చిట్టిబాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియా న్యాయంపల్లి రామకృష్ణ, సాదం నరసింహ నాగ్ ముదిరాజ్ పట్టా చైతన్య వనపర్ల డేవిడ్ రాజు గిరిజన సంఘం నాయకులు బి.గోపిరాజు గోర్ల రమేష్ రెడ్డి పాల్గొన్నారు

నూరుద్దీన్‌కు అవార్డు

ప్రజాశక్తి - నందిగామ : నూరుద్దీన్‌కు కలెక్షన్ ఆఫ్ ఎక్సరేసైజ్ ప్రొఫిషనల్ ఆఫ్ ఇండియా 2025 అవార్డ్‌ను నందిగామ ఏరోబిక్ గురువు మహమ్మద్ నూరుద్దీన్ ఆదివారం అందుకున్నారు. హైదరాబాదులో జరిగిన నేషనల్ స్థాయి గ్రూప్ ఎక్సరసైజ్ కాంపిటీషన్లో ఏరోబిక్ గురువు మహమ్మద్ నూరుద్దీన్ మొదటి స్థానం సాధించారు. గ్రూప్ ఎక్ససైజ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు నూరుద్దీన్ అందుకున్నారు. ఇది నూరుద్దీన్‌కు రెండో సిఇపిఐ అవార్డు. 2022లో ఢిల్లీలో జరిగిన కాంపిటీషన్లో ఎక్సరసైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ద ఇయర్ అవార్డు తీసుకున్న సంగతి పాఠక విదితమే. నందిగామ జిల్లా పరిషత్ హైస్కూల్లో 2016 నుండి ఇప్పటివరకు ఉచితంగా వ్యాయామాలు చెబుతూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మరెన్నో అవార్డులతో నందిగామ కీర్తి ప్రతిష్ఠలను పెంచుతున్న నూరుద్దీన్‌ను నందిగామ ప్రజలు అభిమానించి ఆదరిస్తున్నారు.

అవార్డు అందుకున్న నూరుద్దీన్

4 ఇసుక లారీలు, 2 జెసిబిలు సీజ్

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పెండ్యాల ఇసుక క్వారీలో ఇసుక అక్రమ తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం విచారణకు ఆదేశించారు. నదిలో నేరుగా జెసిబిలతో లారీలకు లోడింగ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే విషయంపై మీడియాలో కథనాలు వెలువడటంతో పాటు, అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఇసుక దోపిడీ జరుగుతుందని ఆరోపణలు వచ్చాయి. ఆదివారం పెండ్యాలలో మునేటిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో ఇసుక అక్రమ తవ్వకాలపై కలెక్టర్ లక్ష్మీశ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

కంచికచర్ల మండలం పెండ్యాల మునేటిలో ఇసుక క్వారీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లోడింగ్ చేస్తున్న సమాచారంపై నందిగామ మైనింగ్ అధికారులు దాడులు చేశారు. మునేటిలో 2 జెసిబిలతో 4 ఇసుక లారీలకు లోడు చేస్తుండగా నందిగామ మైనింగ్ ఏడీ వీరస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. పట్టుబడిన 4 ఇసుక లారీలు, 2 జెసిబిలను సీజ్ చేసి కంచికచర్ల మార్కెట్ యార్డుకు తరలించి, కంచికచర్ల పోలీసులకు అప్పగించినట్లు ఏడీ వీరస్వామి తెలిపారు. అయితే మైనింగ్ అధికారులు పట్టుకొని సీజ్ చేసిన ఇసుక లారీలు, జేసిబీ ల విషయం తమ దృష్టికి రాలేదని కంచికచర్ల ఎస్‌ఐ బి.రాజు చెప్పటం కొసమెరుపు.

సిఆర్‌ఐ పంప్స్ కీలక మైలురాయి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సుస్థిరత, పునరుత్పాదక ఇంధన పరిష్కారాలపై ఉన్న నిబద్ధతలో కీలక మైలురాయిని సాధించామని సిఆర్‌ఎ పంప్స్ ప్రతినిధి బి.రాజేష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. మగేల్ త్యాలా సౌర్ కృషి పంప్ (ఎంటిఎస్‌కెపి) పథకం కింద 7,754 కోట్ల విలువైన 25,000 సోలార్ పంపింగ్ సిస్టమ్స్ సరఫరా చేసేందుకు ముంబయికి చెందిన మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో సిఆర్‌ఐ పంప్స్ అధికారికంగా ఎంప్యానెల్ అయిందని తెలిపారు. ఈ ఎంప్యానెల్‌మెంట్‌తో పునరుత్పాదక ఇంధన పరిష్కారాలు ప్రోత్సహించడం, వ్యవసాయ భూభాగాన్ని శక్తివంతం చేయడం, పచ్చదనంతో కూడిన స్థిరమైన భవిష్యత్తుకు దోహదం చేయడంలో కీలక పాత్ర పోషించడానికి సీఆర్‌ఐ (సీఆర్‌ఎ) పంప్స్ సిద్ధంగా ఉందని తెలిపారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

ప్రజాశక్తి మైలవరం : కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని లక్కిరెడ్డి చిన్న పుల్లారెడ్డి అన్నారు. వెల్వడం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి చిన్న పుల్లారెడ్డి సౌజన్యంతో మైలవరం మండలంలోని 8 పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న 545 మందికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన రూ.45 వేల విలువ గల స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్ బాబూరావు, పి.వెంకటేశ్వర రెడ్డి, కె.గంగరాజు, ఎం.తిరుపతిరావు, వసంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు గ్రామంలోని చెరువు కట్ట బజారులో బైపాస్ రోడ్డులో క్రీస్తు దాసుల సీయోను ప్రార్థన మందిరం తరపున పేదలకు పేద వృద్ధులకు వయోవృద్ధులకు వికలాంగులకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుడు బైబిలు ప్రకారము పేద వృద్ధులను పేద మహిళలను, వయోవృద్ధులను వికలాంగులను దేవుడు ఇచ్చిన శక్తి కొలది 'నీ తోటి వారికి సహాయం చేయాలి' అనే సంకల్పం నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐలుపోగు రాజేష్ పాల్, ఐలుపోగు గ్రేస్ దంపతులు, సంఘ పెద్దలు సంఘ మహిళలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఉక్కు కళా వేదికలో ఆదివారం జగ్గయ్యపేట మండల మెడికల్ అసోసియేషన్స్ సిహెచ్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ శ్రీరామ్ తాతయ్య సోదరుడు శ్రీరామ్ చిన్నబాబు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ వైద్య క్యాంపులో జగ్గయ్యపేట నియోజకవర్గంలో మహిళలకు కేన్సర్ టెస్టులు, పురుషులకు గుండె సంబంధిత టెస్ట్‌లు ఉచితంగా చేయించారు. ఈ క్యాంపులో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ డాక్టర్స్ సమస్యపై నిపుణులైన వైద్య సేవలంది స్తున్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో బాబు జగ్జీవన్ కమ్యూనిటీ హాల్లో వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. వాసవి క్లబ్ నూతన అధ్యక్షునిగా కొప్పు మురళీకృష్ణ, కోశాధికారి కేతేపల్లి సత్యంబాబు, కార్యదర్శి పబ్బతి కిషోర్ మరి కొంతమంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ మహిళలు ఎమ్మెల్యే సౌమ్యను ఘనంగా సత్కరించారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-మోపిదేవి : మహనీయుల ఆదర్శాలతో క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. ఆదివారం మోపిదేవిలోని మహాత్మా పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్ కళాశాల లో జోనల్ స్థాయి ఆటల పోటీలు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలలో పాల్గొనే విద్యార్థులు గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తిని పాటించా లన్నారు. దీనివల్ల విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం మెరుగవుతుందన్నారు. విద్యార్థి దశలోనే జయపజ యాలను స్వీకరించే గుణం అలవర్చుకో వాలన్నారు. తొలుత ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఒలింపిక్ పతకాన్ని జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జు నరావు, మహాత్మా జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ పతకాన్ని మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, సర్పంచ్ నందిగం మేరీరాణి ఆవిష్కరించారు. ఎంజేపీ ఏపీ బీసీడబ్ల్యూ ఆర్ఈఐ సొసైటీ జోన్-2 పరిధిలోని ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి జగ్గయ్యపేట, పెనుగొండ, పెద్దాపురం, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఏలూరు, మచిలీపట్టణం, పాలకొల్లు, అమలాపురం, తుని, అనపర్తి, మైలవరంలతో పాటు మొత్తం 19 వసతి గృహాల నుంచి 500 మంది క్రీడాకారులు తరలివచ్చి ప్రిన్సిపాల్ కే.వీరరవి ఆధ్వర్యంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించి ఎమ్మెల్యేకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, సీఐ కే.ఈశ్వరరావు, పీఎంసీ చైర్మన్ నాగబాబు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - నందిగామ : సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరికి ఇంట్లో ఆనందాలతో పాటు, సిరి సంపదలు వెల్లివిరిసి సుఖ సంతోషాలతో ఉండాలని, అందరికి కొత్త సంవత్సరంతో పాటు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని శ్రీ విద్యా సంస్థ చైర్మన్ కందుల మలికార్జునరావు అన్నారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం నందిగామ శ్రీ విద్యా స్కూల్ ప్రాంగణంలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో మొదటి బహుమతి ఎం. నాగ వనిత రెండో బహుమతి వి.రేవతి, మూడవ బహుమతి సౌజన్య, కన్సోలేషన్ బహుమతులను సాధించారు. విజేతలను పాఠశాల చైర్మన్ కందుల మల్లికార్జునరరావు, డైరెక్టర్ మేకల రాము అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ కందుల మలికార్జునరావు మాట్లాడుతూ సంక్రాంతి అంటే తెలుగు వారు జరుపుకునే అతి పెద్ద పండుగ అని పేర్కొన్నారు. సంక్రాంతి వేడుకల్లో విద్యార్థుల్లో సృజన్మాకతను పెంపోందించేందుకు, చదువుతో పాటు నైపుణ్యానికి పదును పెట్టేందుకు ఈ ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిని శ్రీ విద్యా స్కూల్ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్న జోస్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

పివి సిద్ధార్థలో స్టాండర్డ్స్ కార్నివాల్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలోని ప్రసాద్ వి.పొట్లూరి సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించడం, ప్రోత్సహించడం లక్ష్యంగా స్టాండర్డ్స్ కార్నివాల్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివాజీ బాబు తెలిపారు. ఈ కార్యక్రమం నాణ్యమైన స్పృహ సంస్కృతిని పెంపొందిం చడానికి అంకితమైన రోజు కోసం విద్యార్థులు, అధ్యాప కులు, పారిశ్రామిక వేత్తలను ఒకచోట చేర్చిందన్నారు. కార్నివాల్‌లో సైన్స్, సాంకేతిక ఆవిష్కరణలు, దైనందిన జీవితంలో ప్రమాణాల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటరాక్టివ్ ఎగ్జిబిషన్‌లు, ఆకర్షణీయమైన కార్యకలాపాలు, పోటీలు జరిగాయని ఆయన తెలిపారు. విద్యావేత్తల్లో నాణ్యమైన సంస్కృతిని అందించడానికి సంస్థల నుండి ఇటువంటి కార్యక్రమాలు అవసరమని సైంటిస్ట్-డి, జాయింట్ డైరెక్టర్ ఎం.రమాకాంత్ సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే బిజెపిని వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ప్రజాస్వామ్య వ్యవస్థను తూట్లు పొడిచే మతోన్మాద బిజెపిని వ్యతిరేకిం చాలని, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి, నేతాజీ సెంటర్‌లో ఆదివారం సిపిఎం శ్రేణులు, భారత రాజ్యాంగాన్ని మతసామరస్యాన్ని కాపాడాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి బిజెపి పరిపాలనలో పెనుముప్పు ఏర్పడిందని అన్నారు. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో భారత రాజ్యాంగ పరిపాలనకు బదులు, మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు బిజెపి పూనుకోవటం దుర్మార్గమని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు లేని విధంగా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడమే కాక, ప్రజలపై భారాలు మరింతగా వేసిందని ఆయన మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వలన నిత్యవసర వస్తువులపై ధరల ప్రభావం పడి సామాన్య ప్రజలు అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శిం చారు. ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, విద్యుత్ చట్ట సంస్కరణలు వలన ట్రూ అప్ చార్జీలు, అదనపు చార్జీల పేరుతో మరొక భారం ప్రజల నెత్తిన పడిందని, సామాన్య ప్రజలు బ్రతికే పరిస్థితి లేదన్నారు. ప్రజా వ్యతిరేక బిజెపి విధానాలను వ్యతిరేకించా లని, పెంచిన విద్యుత్ ఛార్జీలను, అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు దొంతి రెడ్డి విజయభాస్కర రెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, దర్శనపు విజయ్ బాబు, కోట బాబురావు, ఎండి బాబ్జి, ఎం మేరీ తదితరులున్నారు.

నేటి నుంచి జాతీయ వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల ఆరో తేదీ సోమవారం నుండి పదో తేదీ వరకు నగరంలోని సిద్ధార్థ జూనియర్ కాలేజ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్టేట్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ, జనరల్ అబ్జర్వర్ జి. భానుమూర్తి రాజు తెలిపారు. నగరంలోని సిద్ధార్థ జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో 68వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించే అండర్ 19 బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌కు చేసిన ఏర్పాట్లపై మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనవరి 6వ తేదీ సోమవారం నుండి 10వ తేదీ వరకు ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు దేశం నలుమూలల నుండి 26 జట్లు పాల్గొని, వారి ప్రతిభను, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు పోటీపడతరన్నారు. టోర్నమెంట్ లో క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొంటూ అన్ని జట్లకు, అధికారులకు సౌకర్యవంతమైన ఆరు 3-నక్షత్రాల హోటళ్లలో ఆతిథ్యం, బస ఏర్పాటు చేశామన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చే క్రీడాకారులకు వారి ఆహార అలవాట్లు ప్రాధాన్యతలకు అనుగుణంగా అన్ని రకాల దక్షిణ, ఉత్తర భారత వంటకాలు అందుబాటులో ఉంచామన్నారు. క్రీడాకారులు, అధికారులకు ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాలు సందర్శించేందుకు వీలుగా ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం ఫ్లడ్‌లైట్ వెలుగుల్లో అన్ని సౌకర్యాలతో నాలుగు కోర్టులతో సహా ఆరు జాతీయ స్థాయి వాలీబాల్ కోర్టులలో మ్యాచ్‌లు నిర్వహించబడ తాయన్నారు. లీగ్-కమ్-నాకౌట్ ఫార్మాట్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు 17 ఆర్గనైజింగ్ కమిటీలు సమన్వయంతో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఎటువంటి లోటుపోట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్టేట్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ, జనరల్ అబ్జర్వర్ జి. భానుమూర్తి రాజు అన్నారు.

నేడు మోపిదేవికి మంత్రి సవిత రాక

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి హాస్టల్లో ఏర్పాటుచేసిన నైపుణ్య అభివద్ధి కేంద్రా న్ని సోమవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రారంబి.ంచ నున్నారు. ఈ సంద ర్భంగా సంక్షేమ శాఖ అధికారులు స్థానిక ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్య అభివద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 104 వసతి గహాల్లో ప్రభుత్వం నూతనంగా ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి కష్ణాజిల్లాలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు కాగా, ప్రస్తుత కష్ణాజిల్లాలో మోపిదేవి, గన్నవరం, పోలాటితిప్ప, కూచిపూడి, అవనిగడ్డల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లీష్, నైపుణ్య అభివద్ధి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఏ.దివ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు లంకేశ్వరరావు, భాస్కరరావు, సురేష్, రాజు, నాగార్జున, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం తగదు

ప్రజాశక్తి-పమిడిముక్కల : వికలాంగుల పెన్షన్ ఏరివేత తగదని, పేదలకు అందించే పింఛన్లను తొలగిం చడం సరికాదని పమిడిముక్కల మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ అన్నారు. ఆదివారం ఆయన పమిడి ముక్కల మండలంలోని హనుమంతపురం గ్రామంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా పథకాలను ఎత్తివేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్లు తొలగించడం మానుకోవాలని అన్నారు.

సంక్రాంతి రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా రంగవల్లుల పోటీలు మహిళా కళాశాలలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్, మాకినేని బసపపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మహిళలు, విద్యార్థినులు ముగ్గులతో చక్కగా అలంకరించారు. ముందుగా సిద్ధార్థ మహిళ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.కల్పన, బిర్లా ఓపెన్ మైండ్స్ నీలిమ, వేమూరి. సత్యవతి, జ్యోతి ప్రజ్వలన, భోగిమంటలతో. వేడుకలు ప్రారంభ మయ్యాయి. సంక్రాంతి కళాకృతులతో బొమ్మల కొలువులు గంగిరెద్దులు, పల్లె పడుచుల వస్త్రధారణతో గొబ్బెమ్మల పాటలతో కోలాహలంగా ముగ్గులు పోటీలు జరిగాయి. 5, 6, 7 తరగతులు, 8,9, 10 తరగతులు, ఇంటర్ డిగ్రీ, మహిళలు నాలుగు కేటగిరీలుగా పోటీలు నిర్వహించారు. శైలజ నాట్యమండలి కూచిపూడి నృత్య రూపకాలు, సింగ్ నగర్ మల్లేశ్వరి, దేవి బందంచే కోలాటం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మధ్యానం జరిగిన బహుమతి ప్రదానోత్సవం లో సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ కల్పన వేమూరి సత్యవతి. , ఫోరం ఫర్ ఆర్టిస్ట్ నుండి, ఎ.సునీల్ కుమార్, ఎంబివికె బాధ్యులు, కె.స్వరూపరాణి..సంధ్యారాణి, ప్రముఖ ఆర్టిస్టు గిరిధర్, సుహాస్తి భారతీదేవి, స్వాతి పూర్ణిమ, పి విజయ, ఝాన్సీ పద్మ బహుమతులు అందజేశారు.

రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హరివిల్లు ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో పాయకాపురంలోని శారదా విద్యాలయ స్కూలు ప్రాంగణంలో మహిళలకు, యువతులకు రంగవల్లుల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా వ్యవహరించిన ఫౌండేషన్ సభ్యులు ఎం.శ్రీదేవి, పి.వాసంతి, కిరణ్మయి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ పలు సామాజిక సేవాకార్యక్రమాలు చేయడమే కాకుండా మన సాంప్రదాయాలను గౌరవించుకుంటూ రంగవల్లుల పోటీలను నిర్వహించడం తమకెంతో ఆనందం కలుగజేస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో మహిళల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించే కార్యక్రమాలు చేయదలిచామని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన శారదా విద్యాలయ ఆంగ్ల, తెలుగు మాధ్యమాల పాఠశాల ప్రధానోపాధ్యాయినీలు, శారద, సురేఖ మాట్లాడుతూ హరివిల్లు ఫౌండేషన్ వారు మహిళలు, యువతులకు రంగవల్లుల పోటీలు నిర్వహించడం ద్వారా వారిలోని సృజనాత్మకతను గుర్తించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొని తమ సహకారం అందజేశారు.

నేటి నుంచి పాలీటెక్ ఫెస్ట్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 6, 7 తేదీల్లో రెండురోజుల పాటు పాలీటెక్ ఫెస్ట్ (2కే24-25) నిర్వహించనుంది. నగరంలోని లబ్బీపేట, ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ ఫెస్ట్ జరుగుతుంది. 'ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ ఫెస్ట్ జరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిప్లొమా విద్యార్థులు టెక్నికల్ ప్రాజెక్టుల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది ఉత్తమ వేదికగా నిలవనుంది. ఈ ఏడాది పాలీటెక్ ఫెస్ట్ ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి దార్శనికతకు అనుగుణంగా పాఠశాల, కాలేజీ విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.గణేశ్ కుమార్ మార్గనిర్దేశంలో జరగనుంది. ఈ స్టేట్ లెవెల్ మీట్‌లో 107 పాలిటెక్నిక్స్ నుంచి 249 ప్రాజెక్టులు ప్రదర్శనలు ఉంటాయి' అని నిర్వాహకులు తెలిపారు.

35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో నాలుగో రోజు ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై పలు కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. పలువురు ప్రముఖుల శతజయంతి సభలు ఏర్పాటు చేశారు.

నేడు పుస్తక ప్రియుల పాదయాత్ర

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పుస్తక ప్రియుల పాదయాత్ర జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె విజయనంద్ పాల్గొనున్నారు. ఆయన జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించనున్నారు. సామస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సీనియర్ సంపాదకులు కే.శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకష్ణ, పాల్గొనున్నారు. ఈయాత్ర మొగల్రాజపురం లోని సిద్ధార్థ కళాశాల నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు కవులు, రచయితలు పాల్గొనవలసిందిగా నిర్వాహకులు పేర్కొన్నారు.

విశాలాంధ్ర పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

సమాజ అభ్యుదయానికి కావాల్సిన అన్నిరకాల సాహిత్యాన్నీ ప్రజలకు అందించేందుకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహెూత్సవంలో నాలుగో రోజు ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై నాలుగో కార్యక్రమంగా విశాలాంధ్ర విజ్ఞానసమితి వారు ప్రచురించిన నాలుగు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ భారతీయ భాషలూ, ప్రపంచ భాషల నుంచి కూడా అభ్యుదయ సాహిత్యాన్ని తెలుగులోకి మార్చి అందించేందుకు తాము ప్రయత్నిస్తామన్నారు. ఈ సభలో కోబడ్ గాంధీ రచించిన బీటలువారిన స్వేచ్ఛను నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సి.నరసింహారావు ఆవిష్కరించారు. డా. మహీధర్ నళినీ మోహన్ రచించిన నక్షత్ర వీధుల్లో భారతీయుల పాత్రను సిద్ధార్థ మహిళాకళాశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర కల్పన ఆవిష్కరించారు. పుస్తకాన్ని తుమ్మల శ్రీ కుమార్ సభకు పరిచయం చేశారు. డా. గార్గి చక్రవర్తి. సుప్రియా చోటాని రచించిన ఎన్.ఎఫ్ ఐ డబ్ల్యు తొలిరోజుల చరిత్ర పుస్తకాన్ని అఖిల భారత మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు డా. కూనంనేని రజని ఆవిష్కరించారు. పరుచూరి జమున పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు, పెన్మత్స దుర్గాభవాని, అక్కినేని వనజలు తొలి ప్రతులను స్వీకరించారు. వివిన మూర్తి రచించిన వాడూ-నేనూ పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజరు హరనాథ రెడ్డిగారు ఆవిష్కరించారు.

భానుమతి రామకృష్ణ శత జయంతి సభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

పురుషాధిక్యతతో నిండిపోయిన సినిమా ప్రపంచంలో ఆత్మవిశ్వాసంతో, ప్రతిభతో సంపూర్ణ వ్యక్తిత్వంతో నిలబడిన నటీమణి భానుమతీరామకృష్ణ అని ప్రముఖ సినీ పాత్రికేయులు రెంటాల జయదేవ్ అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో నాలుగో రోజు ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై మూడో కార్యక్రమంగా ప్రముఖ సినీ నటి భానుమతీ రామకృష్ణ శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినిమాల్లోనూ బయటా కూడా ఆమె నమ్మిన విలువలకు కట్టుబడి జీవించిందన్నారు. ఏ పాత్రను ధరించినా, ఆ పాత్రలో తన వ్యక్తిత్వాన్ని ఆరోపించి, ప్రేక్షకుల మెప్పు పొందిన ఘనత ఆమెది అన్నారు. నటిగా, గాయకురాలిగా, రచయిత్రిగా, నిర్మాతగా, దర్శకురాలిగా, సంగీత దర్శకురాలిగా దాదాపు ఎనిమిది పాత్రలను సమర్థవంతంగా పోషించిన ప్రతిభను ఆమె సొంతమన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ బహుముఖ ప్రతిభతో సినిమారంగంలో ధవతారగా వెలిగిన నటి భానుమతీ రామకృష్ణ అని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100లోపు చిత్రాలలోపుగా మాత్రమే నటించిన భానుమతి తన ప్రతి పాత్రనూ చిరస్మరణీయం చేసిందన్నారు.

పుస్తకావిష్కరణలు చేస్తున్న వక్తలు

భావజాలంపై దాడుల్ని ఖండించాలి : అరసం

సమావేశానికి హాజరైన అరసం సభ్యులు

ప్రజాశక్తి - విజయవాడ : భిన్న అంశాలు, భిన్న భావజాలాలపైన సాహిత్యం, చర్చలు, సంఘర్షణలు, ప్రసంగాలు ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, కానీ నేడు సమాజంలో యువతరం, ప్రజలు నమ్మకానికి వాస్తవానికి మధ్య కొట్టుమిట్టాడుతూ ఏది నిజమో ఏది అబద్ధమో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారని ఈ క్రమంలో మేధావులు, జర్నలిస్టులు, రచయుతలు, హేతువాదులు మీద ప్రశ్నించే శక్తుల మీద ఉన్మాదుల దాడులు, పాలకుల నిర్బంధాలు జరగడం బాధాకరం అని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నాడు నగరంలోని హనుమంతరాయ గ్రంథాలయం హాల్లో జరిగింది. తిరుమల బౌద్ధ క్షేత్రం మాత్రమేనని వేంకటేశ్వర స్వామి కాదనే వాస్తవాలు మీద వెలువడిన పుస్తకాలు హైదారాబాద్ బుక్ ఫెయిర్‌లో అమ్ముతున్న ప్రముఖ జర్నలిస్టు ఎన్.వేణుగోపాల్ మీద దాడి జరిగిందన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో రోడ్డు పక్కన నిద్రపోతున్న పిచ్చివాడిపై మూత్రం పోసిన ఘటనపై స్పందించిన రచయిత మెర్సీ మార్గరెట్ రాసిన ఉచ్చలజల అనే కవితల్లో భారత జాతీయ గీతంతో పోల్చుతూ రచయితపై దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు. ఇటువంటి ఘటనలు ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరసం మన్యం జిల్లా వెలువరించిన కవితా సంకలనం 'శతర' పుస్తకాన్ని పెనుగొండ, రాచపాళెంతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సిరికి స్వామినాయుడు ఆవిష్కరించారు. నేటి యువతరంలో అభ్యుదయ సాహిత్యం భావజాలాన్ని పెంపొందింప చేయడంలో అరసం 85 ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.ఎన్.సాగర్, ఆనంద్, జ్యోతిశ్రీ, కలం ప్రహ్లద, ఈశ్వరరెడ్డి, జి.ఎస్.చలం, అప్పల రాజు, పరుచూరి అజయ్ కుమార్ మోతుకూరి అరుణకుమార్, చంద్రా నాయక్, పెంచలయ్య పాల్గొన్నారు.

బైక్‌ల దహనం కేసు ఛేదించిన పోలీసులు

మతి స్థిమితం లేని బాలుడిగా గుర్తింపు

ప్రజాశక్తి - భవానీపురం : ఈ మధ్య కాలంలో ఈనెల 3వ తేదిన ఎన్.టి.ఆర్.జిల్లా భవానీపురం పోలీస్ స్టేషన్ ఏరియా పరిధి అయిన కొట్టేటి కోటయ్య వీధి, విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి పార్కింగ్ చేసి ఉన్న ఐదే బైక్‌లకు నిప్పు అంటించాడని ఇచ్చిన ఫిర్యాది మేరకు భవానీపురం పోలీస్ వారు కేసు నమోదు చేసి సదరు సంఘటనా స్థలాలకు చేరుకొని విచారించారు. ఈ నేపథ్యంలో సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ఎడిసిపి గున్నం రామకృష్ణ సూచనలతో విజయవాడ వెస్ట్ డివిజన్ ఎసిపి దుర్గారావు పర్యవేక్షణలో భవానీపురం ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, వారి సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి సేకరించిన ఆధారాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని, సిసి కెమెరాలను పర్యవేక్షిస్తూ అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. వారికి అందిన సమాచారం మేరకు ఈనెల 4వ తేదీ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గల కబేళా సెంటర్‌కు చెందిన బాలుడిగా గుర్తించారు. ఆ పిల్లవాడు ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నట్లు, కొన్ని నెలల క్రితం నుండి ఆ పిల్లవాడికి మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల బైక్‌లు దహనం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.